ఆగని రేషన్ దందా

- గత ప్రభుత్వంలో ఎండీయూ వాహనాలతో ఇంటి వద్దకే రేషన్
- ఎండీయూ వాహనాలతో రేషన్ అక్రమ రవాణా అంటూ అసత్య ప్రచారం
- వాహనాలను రద్దు చేసినా ఆగని రేషన్ బియ్యం అక్రమ రవాణా
- కార్డుదారుల నుంచి డీలర్లే కొనుగోలు చేసి విక్రయిస్తున్న వైనం





కొండపల్లిలో పోలీసులకు పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్) ; రెడ్డిగూడెం మండల పరిధి నాగులూరులో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ కె.మాధురి (ఫైల్)

జి.కొండూరు: రేషన్ మాఫియా చెలరేగుతోంది. గత ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్‌ను పంపిణీ చేసేందుకు తీసుకుచ్చిన ఎండీయూ వాహనాలను రద్దు చేసి జూన్ నెల ఒకటి నుంచి కూటమి ప్రభుత్వం రేషన్ దుకాణాలను తెరిచింది. రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేసేందుకే ఎండీయూ వాహనాలను రద్దు చేసినట్లు ప్రభుత్వం బూటకపు మాటలు చెప్పింది. రేషన్ దుకాణాలను తెరిచిన వారం రోజుల్లోపే అక్రమ రేషన్ బియ్యం నిల్వలతో పట్టుబడి పలు షాపులను సీజ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. నేరుగా రేషన్ డీలర్లే అక్రమ రేషన్ బియ్యం రవాణాలో పాత్ర వహించడం విస్మయానికి గురిచేస్తోంది. అధికారుల కనుసన్నలలోనే ఈ దందా కొనసాగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నియోజకవర్గంలో ఇలా..

మైలవరం నియోజకవర్గంలో మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం మండలాల పరిధిలో 159 రేషన్ దుకాణాలు, 84,788 రేషన్ కార్డులు ఉండగా 52 ఎండీయూ వాహనాల ద్వారా నెలకు 1,150 టన్నుల రేషన్ బియ్యాన్ని గత ప్రభుత్వం పంపిణీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత మే నెల వరకు ఈ వాహనాలను కొనసాగించింది. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరిగిపోతుందంటూ జూన్ ఒకటి నుంచి వాహనాలను రద్దు చేసి రేషన్ దుకాణాల ద్వారా బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు.

డీలర్ల ద్వారానే అక్రమ రవాణా..

గతంలో ఇళ్లకు వచ్చి లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి అక్రమ రవాణాకు పాల్పడేవారు. ఇప్పుడు లబ్ధిదారుల నుంచి కొంతమంది డీలర్లే బియ్యాన్ని కేజీ రూ.14కు కొనుగోలు చేసి రేషన్ మాఫియాకు విక్రయిస్తున్నారు. దీనితో రేషన్ మాఫియాకు ఇంటింటికి పోయి కొనుగోలు చేసే అవస్థలు తప్పి అధిక లాభాలను సైతం ఆర్జిస్తున్నారు. ఈ విధంగా నియోజకవర్గంలో ప్రభుత్వం ప్రతి నెలా పంపిణీ చేస్తున్న 1,150 టన్నులలో 70 శాతం బియ్యం లబ్ధిదారులు తినకుండానే అమ్మేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఎండీయూ వాహనాల రద్దు తర్వాత బియ్యం పట్టుబడిన ఘటనలు

- జూన్ 4న ఇబ్రహీంపట్నం ఆరో నంబర్ రేషన్ షాపు యజమాని లబ్ధిదారుల నుంచి వేలి ముద్రలు సేకరించి నగదు పంపిణీ చేశారు. రేషన్ బియ్యం పక్కగదిలో నిల్వ ఉంచారు. పౌరసరఫరాల శాఖాధికారులు ఈ రేషన్ షాపుపై దాడిచేసి 600 కిలోల మిగులు బియ్యం ఉన్నట్లు గుర్తించి షాపును సీజ్ చేశారు
- రెడ్డిగూడెం మండల పరిధి నాగులూరులో రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడుతున్న నంది పాము వరప్రసాద్ అనే డీలరుపై తిరువూరు రెవెన్యూ డివిజినల్ అధికారి కె.మాధురి జూన్ నెల 4న 6-ఏ కేసు నమోదు చేశారు. స్టాకు రిజిస్టరు కంటే అదనంగా 162 కిలోల బియ్యం, 72 కిలోల పంచదార డీలరు వద్ద ఉన్నట్లు గుర్తించారు. కార్డుదారుల నుంచి రేషన్ సరుకులను డీలరు కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు.
- కొండపల్లిలో గత శనివారం తెల్లవారు జామున వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులకు అక్రమంగా రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తున్న రెండు ట్రక్కు వాహనాలు పట్టుబడ్డాయి. ఈ రెండు వాహనాలలో నాలుగు టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో కొన్ని బస్తాలు అయితే నేరుగా ప్రభుత్వం సరఫరా చేసిన రేషన్ బియ్యం బస్తాలను యథాతథంగా అక్రమ రవాణాకు పాల్పడడం విశేషం.

నియోజకవర్గంలో రేషన్ పంపిణీ వివరాలు

మండలం	షాపులు	రేషన్ కార్డులు	రద్దు చేసిన వాహనాలు
మైలవరం	44	22,460	14
రెడ్డిగూడెం	29	15,561	10
జి.కొండూరు	38	19,703	12
ఇబ్రహీంపట్నం	48	27,064	16

తప్పుడు ప్రచారంతో వాహనాలను రద్దు చేశారు

ఎండీయూ వాహనాలతో రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతోందంటూ తప్పుడు ప్రచారం చేసి వాహనాలను రద్దు చేశారు. ఇప్పుడు నేరుగా డీలర్లే కార్డుదారుల నుంచి కొనుగోలు చేసి అక్రమ రవాణాదారులకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల రేషన్ బియ్యం అక్రమ రవాణా ఆగకపోగా కార్డుదారులు నరకయాతన పడుతున్నారు. నియోజకవర్గంలో ఎండీయూ వాహనాలలో పని చేసే వంద మందికి పైగా ఉపాధిని కోల్పోయి రోడ్డున పడ్డారు.

– పసుపులేటి రమేష్, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు

మోసం చంద్రబాబు నైజం

మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



ఆగిరిపల్లిలో మాట్లాడుతున్న ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: ఎన్నికల హామీలు అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను మోసగించడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు విమర్శించారు. ఆగిరిపల్లిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు గుప్పించారన్నారు. అధికారంలోకి వచ్చాక కనీసం మూడు హామీలను కూడా సక్రమంగా అమలు చేయలేదని చెప్పారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఎంతమందికి వచ్చిందో తెలియదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా రైతులకు, మహిళలకు, విద్యార్థులకు చేసిన మంచి ఏమిటని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించడం, అరెస్టులు చేయిస్తూ పాలనను పక్క దారి పట్టిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని చెప్పారు. నియోజకవర్గంలో మద్యం ఏరులై పారుతోందని, మండలంలో అక్రమంగా కొండలు, గుట్టలు, చెరువుల మట్టి, గ్రావెల్‌ను అధికార పార్టీ నాయకులు దోచేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. నూజివీడు నియోజకవర్గంలో ఇంతవరకు ఏ పార్టీ అధికారంలో ఉన్నా దాడులు జరగలేదని, మొదటిసారిగా ప్రజలు, కార్యకర్తలపై ఇలాంటి దాడులు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు.

దాడులకు భయపడం..

నియోజవర్గంలో అధికార పార్టీ నాయకులు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే ఏ ఒక్క కార్యకర్తా భయపడదని చెప్పారు. నూజివీడులో ఇంతవరకు మూడుసార్లు గెలిచానని, ఇలాంటి దాడులు టీడీపీ వారిపై ఒక్కసారి కూడా జరగలేదన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. జగన్ ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు గమనించి చంద్రబాబును ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈసారి వైఎస్ జగన్‌ను, వైఎస్సార్ సీపీని ఎదుర్కోవడం ఏ పార్టీకి సాధ్యం కాదన్నారు. ఏడాది దాటినా ప్రభుత్వం ఏ ఒక్క హామీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని, కూటమి మోసాలను ఇంటింటికి వెళ్లి వివరించాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఎంపీపీ గోళ్ల అనూష, వైఎస్సార్ సీపీ ఆగిరిపల్లి మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మచ్చా హరిబాబు, వైస్ ఎంపీపీ కొండ వరదల రమేష్, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జ్యోతి సుజనా కుమారి, రైతు సంఘం అధ్యక్షుడు ఈలప్రోలు సుబ్బయ్య, గ్రీవెన్స్ కమిటీ అధ్యక్షుడు గుర్రం శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్ వాకా సక్కేశ్వరరావు, ఎంపీటీసీలు సాధం గోపి, నాగుల్ మీరా, మండల ఉపాధ్యక్షుడు రవిశేఖర్, నాయకులు బోయపాటి శ్రీనివాసరావు, నక్కన బోయిన శ్రీమన్నారాయణ, నండూరి భాస్కర ప్రసాద్, గుండ్ల హనుమంతరావు, ఆగిరిపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు చిమటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుంతలు పడి ఏడాదైనా.. స్పందనేది?

- రోడ్డుపై గుంతలతో ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



నూజివీడు-గంపలగూడెం ఆర్అండ్‌బీ రోడ్డుపై శ్మశానం సమీపంలో ప్రమాదకరంగా ఉన్న గుంత



బోర్వంచ రోడ్డు మలుపు వద్ద కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న రోడ్డు మార్జిన్

నూజివీడు: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆర్ అండ్‌బీ రహదారులపై ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంపై వాహనదారులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఆగస్టులో భారీ వర్షానికి పట్టణంలోని బోర్వంచ రోడ్డు మలుపు వద్ద రహదారి మార్జిన్‌లో భారీ గుంత పడింది. గొడుగువారిగూడెం శ్మశానం సమీపంలో పైప్ కల్వర్ట్ దెబ్బతిని రోడ్డుపై భారీ గుంత పడింది. ఈ రెండు పడి ఏడాది అవుతున్నా ఇంతవరకు వాటిని పూడ్చకుండా గాలికొదిలేశారు. అధికారుల తీరు అలా ఉంటే ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోవడం లేదు. గొడుగువారిగూడెం శ్మశానం వద్ద రోడ్డుపై పడిన గుంతకు అడ్డుగా తాటాకులు, ముళ్ల కంప పెట్టారు. అయినప్పటికీ రాత్రి సమయంలో ఎదురుగా భారీ వాహనం వస్తే దాని హెడ్ లైట్ల వెలుగులో ద్విచక్ర వాహన చోదకులకు ఈ గుంత కనిపించని పరిస్థితి నెలకొంది. రోడ్డుపై గుంతలతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యానికి ఇవి తార్కాణంగా నిలుస్తున్నాయని వాహనదారులు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

బొప్పాయి సాగుపై రైతుల ఆసక్తి



చాట్రాయి: పోషక విలువలు కలిగిన బొప్పాయి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం ఉండటంతో బొప్పాయి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. మండలంలోని గంటిపాడు, తుమ్మగూడెం, చిత్తపూరు, గుడిపాడు, కోటపాడు గ్రామాల్లో సుమారు 60 ఎకరాల్లో రైతులు బొప్పాయి సాగు చేస్తున్నారు. ఒక్కొక్క మొక్కను రూ.8కి కొనుగోలు చేసి నాటుతున్నారు. 8 నెలలకు కోతకు వస్తుంది. వాతావరణం సక్రమంగా ఉంటే మొదటి మూడు కోతల్లో కాయ బరువుతో అధిక దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు. 8వ నెల నుంచి మరో 5 నెలల వరకు 20 రోజులకు ఒకసారి కోతలు కోస్తారు. ఇక్కడ కోసిన కాయలను ఢిల్లీ, ముంబాయి, తమిళనాడు రాష్ట్రాలకు వ్యాపారులు కిలో రూ.5 నుంచి రూ.10కి కొనుగోలు చేసి ఎగుమతి చేస్తున్నారు. వీటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్లేట్‌లెట్స్ తగ్గిన వారు ఈ కాయలను తింటే త్వరగా పెరుగుతాయని చెబుతుండటంతో ఎక్కువగా వీటిని వాడుతున్నారు. రిటైల్‌గా వ్యాపారులు కిలో రూ.15 చేసి కొనుగోలు చేస్తున్నారు. గత సంవత్సరం ఎక్కువ డిమాండ్ ఉండడంతో లాభాలు వచ్చాయని రైతులు చెబుతున్నారు. ఎకరానికి రూ.లక్ష ఖర్చవుతుందని, వాతావరణం బాగుండి దిగుమతులు బాగుంటే ఎకరానికి ఖర్చులు పోను రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు.

రోడ్డుపైకి మురుగు నీరు



చాట్రాయి: రోడ్డుపై పారుతున్న మురుగునీటితో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. చాట్రాయి తహసీల్దార్ కార్యాలయం రోడ్డుపై మురుగునీరు పారుతోంది. ఈ మార్గం నుంచి మండల పరిషత్, కార్యాలయాలు, హైస్కూల్, రైతు సేవా కేంద్రం, పశువుల ఆస్పత్రి ఉన్నాయి. విద్యార్థులు, కార్యాలయాలకు వచ్చే ప్రజలు, సిబ్బంది ఈ మార్గం నుంచి ప్రతి రోజూ రాకపోకలు చేస్తుంటారు. గృహాల్లో వాడకపు నీరు రోడ్డుపైకి వస్తుండటంతో నానా అవస్థలు పడుతున్నామని ప్రజలు అంటున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి నాణ్యమైన పరిష్కారం చూపుతామని చెప్పారు.

నేడు విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం



విస్సన్నపేట: స్థానిక ద్వారకా నగర్‌లో గణపతి, కుమారస్వామి, నాగేంద్రస్వామి, అంకమ్మతల్లి, దేవతా శిఖర ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ఉదయం 8 గంటలకు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. ఆదివారం హోమం, ప్రత్యేక పూజలు, విగ్రహాల అభిషేకం, గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

శ్మశాన వాటికలో పిచ్చిమొక్కల తొలగింపు

మైలవరం: మైలవరం మండలం గణపవరం గ్రామంలోని ఎస్సీ శ్మశాన వాటికలో గ్రామస్తులు పొక్లెయిన్ ఏర్పాటు చేసి ముళ్లకంపను, పిచ్చి మొక్కలను ఆదివారం తొలగించారు. గ్రామానికి చెందినవారు మృతిచెందితే అంత్యక్రియలకు ఇబ్బందులు పడుతున్నారు. దీనితో స్థానిక నాయకులు గ్రామ ఎస్సీ శ్మశాన వాటికలో సొంత నిధులతో జేసీబీ ఏర్పాటు చేసి ముళ్ల పొదలను తొలగించారు. వారికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నీట్ పీజీ పరీక్షకు 117 మంది హాజరు



తిరువూరు: స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నీట్ పీజీ పరీక్ష జరిగింది. నేషనల్ మెడికల్ కమిషన్, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ మెడికల్ సైన్సెస్ కంప్యూటర్ ఆధారిత పరీక్షను టీసీఎస్ సాంకేతిక సహకారంతో నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి 150 మంది అభ్యర్థులను పరీక్షకు కేటాయించగా, 117 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ నాగేంద్రబాబు తెలిపారు.

వీధి కుక్కల స్వైరవిహారం



మైలవరం: మండల కేంద్రం రెడ్డిగూడెంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇవి వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ వాహన చోదకులు, పాదచారులపై దాడి చేస్తున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు వీటి బారిన పడి గాయాలపాలవుతున్నారు. వీధి కుక్కలను తప్పించుకునే క్రమంలో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం ఉండటం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వ లక్ష్యాల మేరకు రైతులకు సేవలందించాలి

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



మైలవరం: ప్రభుత్వ లక్ష్యాల మేరకు రైతులకు సేవలందించాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మైలవరం మండలం చంద్రగూడెంకు చెందిన శీలం నవ్యశ్రీ మైలవరం వ్యవసాయ శాఖ మార్కెట్ యార్డులో నూతన ఏఎంసీ చైర్మన్‌గా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులకు అందిస్తున్న పథకాలను వివరించారు. ముందుగా బొర్రగూడెంలోని తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల దేవాలయంలో పూజలు నిర్వహించి ర్యాలీగా ఏఎంసీకి చేరుకున్నారు. కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి ప్రసాద్ డిమాండ్



నూజివీడు: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లు వెంటనే రద్దు చేసి కార్మిక చట్టాలను అమలు చేయాలని సీఐటీయూ ఏలూరు జిల్లా కార్యదర్శి డీఎస్‌వీడీ ప్రసాద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం ఎస్ఆర్ హనుమాన్లు అధ్యక్షతన సీఐటీయూ పట్టణ ఐదో మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ప్రజలపై పన్నుల రూపంలో వేసే భారాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని కోరారు. సీఐటీయూ ఏలూరు జిల్లా మహాసభలను సెప్టెంబర్ 4, 5, 6 తేదీల్లో నూజివీడులో నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం సీఐటీయూ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో కె. జయలక్ష్మి, ఎల్.రంగారావు, దేవదాసు, నాగమణి, పరంజ్యోతి పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణ తరగతులు

ఇబ్రహీంపట్నం: ఎన్‌టీటీపీఎస్ కల్యాణ మండపంలో 20 రోజులుగా నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. యోగా గురువు లంకే జనార్దన్ మాట్లాడుతూ యోగా జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్య వంతులుగా జీవిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా సాధకులతో సూక్ష్మ వ్యాయామాలు, ధ్యానం, యోగాసనాలు, ప్రాణాయామం, యోగా ముద్రలు వేయించారు. యోగా గురువు లంకే జనార్దన్ దంపతులను కార్యక్రమ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఎన్టీటీపీఎస్‌కు చెందిన పలువురు ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ కరపత్రాల పంపిణీ



స్మార్ట్‌మీటర్లు వద్దంటూ నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు, స్థానికులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించవద్దని కొండపల్లి 8, 9 వార్డుల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆదివారం పంపిణీ చేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఈ నెల 5న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కూటమి ప్రభుత్వం రూ.15,485 కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజల నెత్తిన వేసిందని చెప్పారు. తక్షణమే స్మార్ట్ మీటర్లు బిగించడం ఆపాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులగొట్టాలని పిలుపునిచ్చారని, అధికారంలోకి వచ్చి వారే మీటర్లు బిగిస్తున్నారని విమర్శించారు. సీఐటీయూ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

- **విస్సన్నపేట:** విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను బిగించవద్దని సీపీఎం మండల కార్యదర్శి వి. నాగరాజు డిమాండ్ చేశారు. ప్రజలపై విద్యుత్ చార్జీల భారం పడకుండా చూడాలని కోరుతూ సీపీఎం నాయకులు ఆదివారం కరపత్రాలు పంపిణీ, సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 5న నిరసన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీపీఎం పట్టణ కార్యదర్శి మేకల జ్ఞానరత్నం, కొరెడ్ల ధనలక్ష్మి, కె. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా?



చాట్రాయి-నర్సాపురం రోడ్డుపై ఏర్పడిన గుంత

చాట్రాయి: మండలంలోని పలు రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు ప్రయాణికులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. చాట్రాయి నుంచి విస్సన్నపేట మండలం నర్సాపురం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై రెండు చోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. చాట్రాయి సెంటర్ నుంచి బూరుగుగూడెం వెళ్లే రోడ్డు అడుగడుగునా గుంతలతో దర్శనమిస్తోంది. చాట్రాయి సెంటలో జనార్ధనవరం వెళ్లే రోడ్డు కోతకు గురికావడంతో వాహనాలపై ప్రయాణం కష్టతరంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలు లేని రోడ్లను ఏర్పాటు చేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు మరమ్మతులు చేయకపోవడంపై బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు పెంచాలి

ఏఐటీయూసీ నేత రామారావు డిమాండ్



మాట్లాడుతున్న చలసాని వెంకట రామారావు

నూజివీడు: మున్సిపాలిటీలలో పనిచేసే కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను ప్రభుత్వం వెంటనే పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని అమర్ భవన్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఆయన మట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించే విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను అధికారం చేపట్టి ఏడాది గడిచినా అమలు చేయకుండా జాప్యం చేయడం సమంజసం కాదన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.32 వేలు ఇవ్వాలని, కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఇందుపల్లి సత్యప్రకాష్, చాట్ల పుల్లారావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె. విగ్నేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.